# పులిరాజు

**— కావిలిపాటి విజయలక్ష్మి**

అది 'లగిసిపిల్లి' శివాలయం ముందు ఒక మహా వృక్షం. దాని ప్రక్కన మరొక వృక్షం సుమారుగా అంతటిదే. ఆ రెండు చెట్ల మధ్య ఎప్పుడో ఏ భక్తులో లేక ఆ గిరిజన ముఠాదారులో నిర్మించిన మెట్లు.

ఆ మెట్ల మీద కూర్చున్నాడు అప్పడుదొర. అతని చుట్టూ అల్లుకుని ఉన్న అడవి కాని, కొండలు కాని, ఆ మెట్ల దిగువ నుంచి సన్నగా 'లగిసిపిల్లి' గ్రామం వైపు వెళ్ళే బాట కానీ, నీళ్ళ కడవలతో వెళ్ళే మహిళలు కాని కనుపించటం లేదు.

అతని దృక్పథంలో గోచరించేది ఒకటే!

ఎఱ్ఱని అగ్ని గోళాల్లా రాత్రి వేళ మెరిసే కనులు, పసుపు పచ్చని రంగు. నల్లని-చారలు.

'దాన్ని....దాన్ని....' అనుకున్న అతను పళ్ళు పటపటా కొరికాడు. అతని ఎర్ర వారిన కనుల్లోంచి నీటి బొట్లు జలజలా జారాయి. చెంపలు తడిశాయి.

తర్వాత తను అల్లారు ముద్దుగా పెంచుకున్న తెల్లని లక్షణమైన ఆవు గుర్తుకు వచ్చింది. భుజంమీంచి వేళ్ళాడుతూన్న గుడ్డ నోటికి అడ్డం పెట్టుకుని ఏడ్చాడు బిగ్గరగా.

వారం క్రితం అతను మాడుగుల సంతకెళ్ళి, 'భూతాల కోచి' (విశాఖనుంచి హుకుంపేట వెళ్ళే బస్సు)లో పాడేరు వస్తున్నాడు. ఏడవ మైలు రాయి దగ్గర బస్సు స్పీడు తగ్గిపోయింది. హారన్ మ్రోగింది.

"పులి....పులి! చూడండి!" అన్నాడు డ్రయివరు.

సన్నని తుంపర, చలిగాలి. రోడ్డుకి అడ్డంగా కాళ్ళు పారజాపి, తోక చివర చిన్నగా ఊపుతూ, ఎర్రగా వెలిగే కళ్ళతో బస్సు వైపు హుందాగా చూస్తూంది పులి.

హారన్ విరామం లేకుండా మ్రోగుతోంది. బస్ హెడ్‌లైట్ల వెల్తురు రోడ్డు పొడవునా పరుచుకుంది. ఆ వెల్తురులో పులి రాజసంగా పడుకుని బస్ వైపు చూస్తూంది. దాని కన్నుల్లో, 'ఇది

నన్నేం చెయ్యగలదు' అనే ధీమా!

"అందరూ అరవండయ్యా! గోల చెయ్యండయ్యా!" అన్నాడు డ్రయివరు.

బస్సులో నిల్చుని పులి వైపు సంభ్రమంగా, భయంగా, ఆసక్తిగా చూస్తున్న జనం గొల్లున అరిచారు. ఆ జనంలో అప్పుడుదొంగ వున్నాడు. పులిని చాలా సరదాగా చూశాడు. ఇటువంటి అనుభవం తన జీవితంలో అరుదుగా వస్తుందని భావించాడు.

పులి నెమ్మదిగా వొళ్ళు విరుచుకుని లేచి నిల్చుంది. బస్‌వైపు ఓసారి తీక్షణంగా చూసింది. నెమ్మదిగా, హుందాగా నడుస్తూ బస్ ప్రక్కనుంచి నడిచి వెళ్ళిపోయింది.

బస్ మూడు మైళ్ళ దూరం వరకూ ఏరోప్లేన్‌లా పరుగెత్తింది.

"డ్రయివరు మనల్ని చంపేలాగున్నాడు. పులి అయితే ఒకడ్నే





చంపేదేమో! ఇతను మనందర్నీ అగాధంలో తోసే లాగున్నాడు" అన్నారెవరో.

కొందరి పెదవులపై చిరునవ్వు కదిలింది.

బస్సు స్పీడు తగ్గింది. అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

"ఇవ్వాళ మనం చూసినది అద్భుత దృశ్యం!" అన్నారొకరు.

"నా గుండె దడ ఇంకా తగ్గలేదు" అన్నారు మరొకరు.

"అబ్బ! ఎంత పెద్ద పులి! దాని బుర్ర ఎంత పెద్దది!" ఇంకొకరు.

"ఎంత నిబ్బరం!" వేరొకరు.

అంతవరకూ నిశ్శబ్దంగా ఉన్న జనం మాటల్లో దిగారు. అంతా పులి గురించిన సంభాషణే.

పాడేరులో బస్ దిగిన అప్పుడు దొర లగిసిపిల్లి వైపు గబగబా నడిచాడు.

సరిగ్గా నాలుగు రోజులకు అతని ముద్దుల ఆవును పొట్టన పెట్టుకుంది పులి.

మేతకెళ్ళిన ఆవు సాయంత్రం తిరిగి రాకపోతే మరు రోజు వస్తుందనుకున్నాడు. ఆ రోజూ తిరిగిరాలేదు. అతనికి అనుమానంగా వుంది—'పులి ఆవుని చంపి ఉంటుంది' అని. ఆ ఊహ అతను భరించలేకపోయాడు. 'లేదు, చూలు గొడ్డు కదా! ఏ చెట్టు నీడనో పడుకుని ఉంటుంది. ఏ కొండ చాటునో తప్పి ఉంటుంది' అనుకున్నాడు.

పది మందిని తోడు పిలిచి డప్పులు మోగిస్తూ అడవిలోంచి, చెట్ల మధ్యనుంచి, బండరాళ్ళమీంచి దూసుకు పోయాడు- ఆవుని వెదుకుతూ.

పులి అడుగు జాడలు కనుపించాయి.

ఆ రోజు రోడ్డుకి అడ్డంగా పడుకున్న పులి అతని దృక్పథంలో మెదిలింది. అతని గుండె గుభిల్లుమంది. 'ఆవును—దాని అడుగు గుర్తులే ఇవి. అదే నా ఆవుని పొట్టనపెట్టుకుని ఉంటుంది'అనుకుని అడుగులు గబగబా వేశాడు గుర్తుల వెంట.

సన్నని దుర్వాసన!

అప్పుడు ఏదో ఊహించాడు. అతని కనుల్లో నీరూరింది. 'వన్య మృగాల్ని వేటాడకూడదు' అనే నిషేధాన్ని ఏవగించుకున్నాడు.

చదునుగా ఉన్న ఓ బండ పలకమీద అప్పుడు దొర ఆవు తాలూకు అవశేషాలు కనుపించాయి.

ఆగిపోయారందరూ.

"పులి సంపేసింది. నెల రోజులుగా గొర్రెలు, మేకలు, పసువులు తినేస్తున్నది పులి. రిపోర్టివ్వరా! కాయితం రాసి తాసిల్దారుకి పెట్టు" అన్నాడొకడు ఉక్రోషంగా.

"మన కాయితం ఎవడు పట్టించుకుంటాడు? మనమే పులిని సంపి పాతిపెట్టే పోలా!" అన్నాడు అప్పుడు దొర.

"చిన్నయ్యమీద కేసు ఇంకా నడుస్తున్నది. మన తాతలు తండ్రుల కాలమైతే వేట ఉండేది. పులి మన జోలికి, మన పశువుల జోలికి వస్తే సంపి పారేసేవారు. ఇప్పుడు అలా కుదరదు కదా?" అన్నాడొకడు నీతిబోధ చేస్తున్నట్లు.

అప్పటి రోజుల్లో దేనికైనా

ముఠాదారు ఆజ్ఞే! అతను ఏం చెయ్యమంటే అది చేసేవారు. ముఠాదారు మంచివాడయితే వారి జీవితం సుఖమయం. లేకపోతే నరకమే. ముఠాదారు రాజులా వెలిగేవాడు ఆజ్ఞలు జారీచేస్తూ.

"పల్లపోళ్ళు సేరి మన బతుకులు పాడు చేస్తున్నారు" అన్నాడో వృద్ధుడు.

"తెలివి సెపుతున్నారు. పాడు సేశారా?" అన్నాడో యువకుడు రోషంగా.

"ఏటి తెలివి? మెకమెన్ని పశువుల్ని తిన్నది? ఎన్ని కాయితాలు పెట్టామో! పారెస్టోళ్ళు పాతికో పరకో ఇస్తే మన డబ్బు వచ్చినట్టేనా? మన నష్టం తీరినట్టేనా? పులిని సంపి కప్పెట్టేయ్యండి-తోలూ గీలూ తియ్యొద్దు" అన్నాడో వృద్ధుడు చేతిలో ఉన్న లావాటి కర్ర నేలకేసి కొడుతూ.

"అంతే!" అన్నాడు అప్పుడు దొర జారిన కన్నీరు వత్తుకుంటూ.

"ఇవాళ రాత్రి దీన్ని కాల్చెయ్యాలి. ప్రెసిడెంటు దగ్గర మర తుపాకీ ఉన్నది" అన్నాడో వృద్ధుడు మళ్ళీ.

అందరి కనులూ చుట్టు ప్రక్కల పరికించాయి.

చెట్టుమీద మంచె వేసి మాటు కాయడానికి చెట్లు లేవు. చిక్కగా అల్లుకుని వున్న చిట్టడవి అది.

"కాయితం పెడతాను. ఆళ్ళు ఆ పులిని చంపుతారో లేక నన్ను చంపమంటారో అడుగుతాను" అంటూ వెనుదిరిగాడు అప్పుడు దొర.

మళ్ళీ ఏదో గుర్తువచ్చినట్లు, ఆవు అవశేషాలవైపు నెమ్మదిగా నడిచాడు. చేతులు జోడించి నమస్కరించాడు. కనులు, ముఖం భుజం మీది గుడ్డతో తుడుచుకున్నాడు. తమాయించుకున్నట్లు ఊపిరి పీల్చి వదిలాడు.

అందరూ 'లగిసిపిల్లి' పోయే తోవవైపు నడక సాగించారు.

* * *

రోజుకో ఊర్లో ఏదో పశువుని తినేస్తూంది పెద్ద పులి. గ్రామస్థులు సాయంత్ర మవడంతో భయపడుతున్నారు. అర్ధరాత్రి పులి గాండ్రింపు వినిపిస్తుంది. డప్పులు మోగిస్తారు, అరుస్తారు. అయినా అది దేన్నోకదాన్ని ఎత్తుకుపోతూనే వుంది.

తాశీల్దారుకి కాయితం ఇస్తారు. అతను సానుభూతి ప్రకటిస్తాడు.

ఫారెస్టాఫీసర్‌కు ఓ కాయితం ఇచ్చి ఏడుస్తారు. అతను చచ్చిన దాని ఖరీదు ఎంత వుంటుందో, దానికెంత ఇవ్వాలో ఇస్తాడు—

ఓదారుస్తున్నట్లు.

'పులి' ఆ ప్రాంతాలకో పెద్ద సమస్య అయ్యింది. చంపి పారెయ్యాలని చాలాసార్లు అనుకున్నారు. కాని పులిని చంపిన చిన్నయ్య మీద వున్న కేసు వారిని భయపెడుతూంది. ఇదే వారి తాత తండ్రుల నాటి కాలమైతే- పులి పశువుని చంపిందంటే వేటాడి చంపేవారు. చర్మం, కొవ్వు, గోళ్ళు అమ్ముకునే వారు. వేట అప్పటి రోజుల్లో ఒక విధి. ప్రతివారూ వేటకు పోయే వారు.

ఇవ్వాళ అప్పుడు దొరగుండెల్లో మండిపోతూంది. 'ఈరోజు మాటు వేసి వేటాడవలె. తన కసి తీరవలె.'

అదే మాట పైకే అంటూ లేచి నిల్చున్నాడు.

అతని భుజం మీద చల్లని చెయ్యి పడింది.

తెల్లగా నెరసిన జుట్టు, వెనక నిమ్మకాయంత ముడి, మెలితిరిగిన మీసాలూ, బలిసిన గెడ్డం, విశాలమైన నుదురు, పొట్టి ముక్కు, గుండ్రని కనులు, నెరసిన దట్టమైన కనుబొమలు.

ముతాదారు! ఓనాటి వారి ప్రభువతను.

అతన్ని కౌగలించుకొన్నాడు అప్పుడు దొర. అతనికి పొంగి పొరలి వచ్చింది దుఃఖం. "ఈ కాలంలో నువ్వు మాకు దొరవైతే పులిని సంపీమనీఓడివి. పులిని చంపి దాని రక్తం తాగి పేగులు మెడలో వేసుకుని...." శంకరుడి వేపు చెయ్యి చాపి, "ఆ దేవుడికి మొక్కేవాడిని. నా గుండె మంట చల్లారేది" అన్నాడు అప్పుడు దొర.

"చెబుతాను - చంపుదాం. వల్లకో!" అప్పుడు దొర వీపుని నిమిరి ఓదార్చాడు మాజీ ముతాదారు సన్యాసి దొర.

అప్పుడు దొర, సన్యాసి దొర అల్లుడే. ఆ అల్లుడు ఆ ఆవుని ఎంత మమకారంతో పెంచాడో అతనికి తెలుసు. ఆవుని పులి చంపిందని తెలుసుకున్న దగ్గర నుంచీ అప్పుడు సరిగా అంబలి అన్నం తినటంలేదు.

"దా-పోదాం!" అప్పుడు దొర చెయ్యి పట్టుకున్నాడు సన్యాసి దొర.

"ఈ దేవుడి దగ్గిర, ఈ చెట్టు మీద మాటుకాసి పులిని చంపి కాని ఇంటికి రాను!" చేతులూపుతూ చెప్పాడు అప్పుడు దొర చతికిల బడి కూర్చుంటూ.

నవ్వాడు-గుబురు మీసాలు కదిలేలా ముతాదారు. "తర్వాత జైలుకు

పోతావురా. కొంచెం కల్లు తాగు, సారా తాగు" బ్రతిమిలాడాడు.

లేచి అతని వెంట నడిచాడు అప్పడు దొర.

తాగిన అప్పడు దొర తాశీల్దారునీ, ఫారెష్టు వాళ్ళనీ, పులినీ, పాడేరు వైపు పరుగులు తీసే తనను అడ్డగించే మామనీ బూతులు తిట్టాడు.

అవ్వాళంతా తాగుతూనే ఉన్నాడు. నోటి కొచ్చినట్లూ వాగుతూనేఉన్నాడు. ఆ మైకంలో భార్య తెచ్చిన అంబలి గిన్నె విసిరేశాడు. రెక్కపట్టి పిల్లల్ని ఈడ్చికొట్టాడు. భార్య జుట్టు పట్టి బయటి కీడ్చాడు. అడ్డం వచ్చిన ప్రతి మనిషీ అతని చేత తన్నులు తిన్నాడు.

* * *

ఫారెష్టు వారివ్వబోయిన డబ్బు తీసుకోలేదు అప్పడు దొర. వద్దన్నాడు.

"నాకు నా ఆవు నియ్యి లేదా పులిని చంపు. ఈ ఎదవ డబ్బు నాకు వద్దు" అని చరచరా వెళ్ళి పోయాడు వచ్చినంత వేగంగానే.

మొత్తం మీద పులి అలజడి రేపింది. పగలూ- రాత్రీ అని లేకుండా విచ్చలవిడిగా తిరగ సాగింది.

అప్పుడు ఆఫీసర్లలో కదలిక పుట్టింది. బోను తెప్పించి పెట్టి చూశారు.

ఎర చూపించారు. కాని ఫలితం శూన్యం.

ఉన్నట్లుండి పులి అస్సలు కనిపించటం మానేసింది. అప్పడు దొర చాలా సంతోషంగా కనిపిస్తున్నాడు.

ఓ రోజు 'పులిరాజు' అప్పడు దొరని పరామర్శించటానికి వచ్చాడు.

అప్పడు తన ఆవును పులి చంపినందుకు మరోసారి విచారించాడు. తర్వాత, "తాతా! నీకీ పేరెలా వచ్చింది?" అడిగాడు- కాళ్ళకి చెంబుతో నీళ్ళివ్వటం, పీట వాల్చి కూర్చోమనటం, అంబలి గిన్నె ముందు పెట్టటంలాటి అతిధి మర్యాదలు అయిన తర్వాత.

'పులిరాజు' పండు మీసాలు దువ్వుకొని ముసిముసిగా నవ్వుకుంటూ చెప్పాడు....

"పేరా? తాత తండ్రుల నుంచీ వచ్చిన పేరిది. మా తాతతాత సాహసంతో పులిని చంపాడు. ఎలాగో తెలుసునా? అతను కర్రలకు వెళ్ళాడు. పులి ఎదురయ్యింది. అది పంజా ఎత్తింది. తను గొడ్డలి ఎత్తాడు. పులి మీద పడింది, దానితో యుద్ధం చేశాడు. దాన్ని

సంపేడు. తర్వాత మరురోజు అతను చచ్చిపోయాడు. అతన్ని అందరూ 'పులిరాజు' అనేవారు. అతనంటే గూడెమంతా జడిశేదట. అతని దగ్గర అందరికీ బయమట. అతను రోజూ వేట తెచ్చేవాడట. అతన్ని చూసి జంతువులు జడిసేవట. అతని పేరే మా వాంశానికి వచ్చేసింది. ఇప్పుడంటే పల్లె పోళ్ళు వచ్చి రోడ్డు పడి-ఏటో రోజులు మారిపోయాయి కాని, అప్పుడు మనరాజ్యమెలా ఉండేది?" అని గతం తలుచుకొంటూ శూన్యంలోకి చూశాడు 'పులిరాజు.'

"అయితే నేనూ పులిరాజునే!" అన్నాడు అప్పుడు దొర చప్పున.

కొందరు నవ్వారు గలగలా. కొందరు ముసిముసిగా నవ్వారు.

"నువ్వేలాగవుతావు? నువ్వు పులిని చంపావా? సింహాన్ని చంపావా? మేక పోతునన్నా కొట్టలేదు!" హాస్యమాడింది అతని భార్య.

"నీకు తెలియదా? ఈ ప్రజల్ని ఈ గ్రామాన్ని గజగజలాడించిన, ఫారెస్టు వాళ్ళకి కూడా చిక్కకుండా పోయిన పులి ఏటయ్యిందంటావు?" మీసం దువ్వి జబ్బ చరుచుకున్నాడు అప్పుడు దొర.

"వూరుకో-వూరుకో!" మందలింపుగా అందామె మళ్ళీ.

"నువ్వు చంపావా పులిని?" అడిగాడు 'పులిరాజు' అప్పుడిని.

"నేను... నేను...." తడబడిపోయాడు అప్పుడు.

"వాడు ఏమి చంపగలడు పులిని?" అని నవ్వేశాడు సన్యాసి దొర.

"నేను నాలుగు మెకాల్ని, ఐదు ఎలుగుల్ని, పందుల్ని, మేకల్ని ఎన్నో వేట చేస్తిని. నన్ను ఎవరు ఏమి చేస్తారో చెయ్యమను?" అని సవాలు చేశాడు 'పులిరాజు.'

'పులిరాజు' అంటే వాళ్ళ అర్థం 'పులి'ని చంపినవాడు 'రాజు' అని.

ఆరోజు ఉండి తన గ్రామం 'జరకొండ' వెళ్ళిపోయాడు పులిరాజు.

పులి గాండ్రింపులు ఆ అడవిలో మరి వినిపించలేదు. ఆ పులి అడుగు జాడలు నేలపై కనుపించలేదు. నిగనిగలాడే చర్మంతో, అందంగా ఉండే ఆ పులి, ఆ అరణ్యంలో హుందాగా రాజసంగా మరి తిరగలేదు.

పులి ఏమయిందో ఎవరికీ తెలియదు.

ఆవు బ్రతికి ఉన్న నాటి కన్నా,

పులి పోయిన సంతోషం ఎక్కువగా ఉంది అప్పడు దొరలో.

లగిసిపిల్లి శివాలయంలో అప్పడు దొర అభిషేకం చేయించాడు. ఏ అర్ధ రాత్రో అతని మ్రొక్కు కూడా తీర్చుకొనే ఉంటాడు.

తన స్వాభావికమైన ఆహారం కోసం వేటాడటం పులిది తప్పా? తమ పశువుల్ని నష్టపోతున్నామని పులిని గుట్టుగా వేటాడి కప్పెట్టిన మనుష్యులది తప్పా?

మనుష్యులదే రైటంటాడు 'పులి రాజు.'

తనది రైటంటుందేమో పులి మరి!

ఆ నాటి నుంచీ అప్పడు దొర 'నా పేరు పులిరాజు' అంటాడు. *

## పాఠకులకు మనవి!

'విజయ' వెల వచ్చే సంచికనుండి రూ 3-50. ఐదేళ్ళ క్రితం ప్రారంభించిన 'విజయ' ప్రతి నెలా అభిమానుల్ని పెంచుకుంటూ పాఠకుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొంది, అగ్రశ్రేణి పత్రికగా వెలుగొందుతున్న ఈ తరుణంలో రేటు పెంచి, మా పాఠకులకు కొద్దిపాటి అసౌకర్యాని కలుగజేయవలసి వచ్చినందులకు ఎంతో విచారిస్తున్నాం.

ఐదేళ్ళ క్రితానికి ఇప్పటికీ పేపరు, ముద్రణ, బ్లాక్ మేకింగ్ ఇత్యాది పత్రికానిర్వహణకు అవసరమైన ప్రతి దాని రేటు యాభై శాతం చొప్పున పెరిగిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో 'విజయ' రేటును 3 రూ|| నుండి 3-50 కి పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ఒక కథల పత్రిక, ఒక నవల, ఒక హాస్యపత్రిక, ఒక సినిమా పత్రిక, ఒక చారిత్రక సీరియల్—మొత్తం ఐదు విడి విడి పుస్తకాలను ఒకే పుస్తకంగా అందజేస్తున్న ఏకైక పత్రిక 'విజయ' రేటు విషయంలోని మార్పును, సహృదయంతో అర్థం చేసుకోవలసిందిగా ఏజెంట్లకు, పాఠకులకు మనవి చేస్తున్నాము.